అంగన్‌వాడీల సమరశంఖారావం

- సమస్యలు పరిష్కరించాలని యూసుఫ్‌గూడ స్టేట్‌హోం వద్ద ధర్నా

జూబ్లీహిల్స్, జూలై 19 : తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమరశంఖారావం పూరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ స్టేట్‌హోం ఎదుట భారీ ధర్నాకు దిగారు. ప్రభుత్వ వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై రెండు రోజుల క్రితం స్వయంగా మంత్రి హామీ ఇచ్చినా విశ్వసనీయత లేని ప్రకటనగా పేర్కొంటూ మెరుపు సమ్మెకు దిగారు. దీంతో అమీర్‌పేట్ మైత్రి వనం నుంచి యూసుఫ్‌గూడ మీదుగా నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ప్రజలు ట్రాఫిక్‌జామ్‌తో గంటల కొద్దీ ఇబ్బందులుపడ్డారు. అంతుకుముందు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్, డైరెక్టర్ కాంతి వెస్లీకి అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, ప్రధాన కార్యదర్శి జయలక్ష్మితో చర్చలు జరిపి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

యూసుఫ్‌గూడ స్టేట్‌హోం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్

1104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): మింట్ కాంపౌండ్ హైదరాబాద్‌లోని విద్యుత్తు కార్మికభవన్ 1104 యూనియన్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం యూనియన్ అదనపు కార్యదర్శి వరప్రసాద్ స్టార్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. స్టార్ హాస్పిటల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ నిశాంత్‌రెడ్డి విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్స్‌కు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నందన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేశారు. ఆర్థోపెడీషియన్ డాక్టర్ అభిషేక్ ఎముకల పటిష్టం, ఇతర ఆరోగ్య సమస్యలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సుధీర్, సలహాదారు జనార్దన్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు వేణు, అదనపు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరావు పాల్గొన్నారు.

'రేషన్ డీలర్ల' హామీలను అమలు చేయండి

రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తామని, కమీషన్ పెంచుతామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర కమిటీ తరపున విజ్ఞప్తి చేశారు. 17,200 మంది రేషన్ డీలర్లు చాలీచాలని కమీషన్లతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

545 దరఖాస్తులు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 545 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 95, పౌరసరఫరాలు 84, విద్యుత్తు 82, హౌసింగ్ 79, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి 47, ఇతర శాఖలకు 158 దరఖాస్తులు అందాయి.

ఎస్సీ వర్గీకరణ కోసం ఢిల్లీలో దీక్షలు

ఆగస్టు 6 నుంచి మూడ్రోజులపాటు: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

చిక్కడపల్లి, జూలై 19 : అసెంబ్లీ ఎన్నికల ముందు దేశ ప్రధాని హోదాలో మోదీ తెలంగాణకు వచ్చి ఎస్సీ వర్గీకరణ చేపడుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎస్సీ వర్గకరణ చేపట్టాలని ఆగస్టు 6,7,8 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ ఆ అంశాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టిందని ఆరోపించారు. తాజాగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా కమిటీ వేసి కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ జాప్యాన్ని, మోసాన్ని ఎండగట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు శ్యామ్‌రావు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోల్లూరు వెంకట్, ప్రధాన కార్యదర్శి గుమిడేలి తిరుమలేశ్, లక్ష్మణ్, ప్రేమదాస్, రాజు, నరేశ్, నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

బీజేపీ మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

- టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

యాదగిరిగుట్ట, జూలై 19: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ధీమా వ్యక్తంచేశారు. ఆగస్టు 9న చలో ఢిల్లీ కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మాదిగ, మాదిగ ఉపకులాల వారంతా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం యాదగిరిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్య మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణే ఏకైక లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని స్పష్టంచేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ.. ఆ తర్వాత మోసం చేసిందని మండిపడ్డారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, మేధావుల ఫోరం నాయకులు డాక్టర్ రాజ మౌళి, ప్రొఫెసర్ డాక్టర్ మల్లేశ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గెల్వయ్య, దాసి మోహన్, మంచాల యాదగిరి, బీ శంకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

బీజేపీకి చిరు, పవన్ ఎలా మద్దతిస్తారు?

- రైతులపై ప్రేమ సినిమాలకే పరిమితమా?
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధ్వజం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): రైతుల కష్టాలపై సినిమాలు తీసే చిరంజీవి, పవన్‌కల్యాణ్ రైతు వ్యతిరేక బీజేపీకి ఎలా మద్దతిస్తారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులపై ప్రేమను ఒలకబోస్తూ సినిమాలు తీసిన చిరంజీవి, పవన్‌కల్యాణ్ నిజ జీవితంలో మాత్రం నల్లచట్టాలు తీసుకొచ్చి రైతుల ప్రాణాలు తీసిన బీజేపీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. నల్లచట్టాలపై చిరంజీవి, పవన్‌కల్యాణ్ ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్, రైతులకు ఎన్ని వేల కోట్ల రుణమాఫీ చేసిందో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణాలను మాఫీ చేసిన దాఖలాలున్నాయా? అని ప్రశ్నించారు. బడా పారిశ్రామికవేత్తలకు మోదీ సర్కార్ 16 లక్షల కోట్ల బ్యాంక్ రుణాలను మాఫీ చేసిందే తప్ప రైతు రుణాలను మాఫీ చేసిందా? అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేయడంతో ప్రతిపక్ష నేతలకు నిద్రపట్టడం లేదని విమర్శించారు.

'యువ లిమిట్‌లెస్' పాడ్‌కాస్ట్‌లో సందీప్ శాండిల్య

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య 'యువ లిమిట్‌లెస్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడినట్టు యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎక్స్ వేదికగా తెలియజేసింది. ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ 'యువ లిమిట్‌లెస్' అనే పాడ్‌కాస్ట్‌ను నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ దుష్పరిణామాలపై విస్తృతంగా చర్చించామని టీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు యువతను ప్రోత్సహించేలా సందీప్ శాండిల్య మాట్లాడారని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కొనియాడింది.

ప్రణీత్ హనుమంతుపై నార్కోటిక్ కేసు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : యూట్యూబర్ ప్రణీత్ హనుమంతుపై డ్రగ్స్ కేసు నమోదుకాగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో ఉంచారు. చంచల్‌గూడలోని సెంట్రల్ జైలులో ఉన్న ప్రణీత్ హనుమంతు గతంలో డ్రగ్స్ సేవించినట్టు నార్కోటిక్ బ్యూరో దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఓ తండ్రి, కూతురు వీడియోపై అసభ్యకరంగా మాట్లాడిన కేసులో ఈ యూట్యూబర్‌ని ఇటీవలే సైబర్ సెక్యూరిటీ పోలీసులు అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం ప్రణీత్‌ను మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని సైబర్ సెక్యూరిటీ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

నకిలీ ఆధార్‌తో సుప్రభాత టికెట్లు

- తిరుమలలో 400 సార్లు రిజిస్ట్రేషన్
- 20సార్లు సేవకు వెళ్లిన బెంగళూరు భక్తుడు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి దర్శనం, సుప్రభాత సేవకు ఓ భక్తుడు నకిలీ ఆధార్ కార్డులను వినియోగించి విజిలెన్స్ అధికారులకు అడ్డంగా దొరికాడు. బెంగళూరుకు చెందిన శ్రీధర్ నకిలీ ఆధార్ కార్డుల ద్వారా టీటీడీ లక్కీడిప్ సేవా టికెట్ల కోసం ఏకంగా 400 రిజిస్ట్రేషన్లు చేసినట్టు గుర్తించారు. ఇప్పటి వరకు 20 సార్లు సుప్రభాత సేవ టికెట్లు పొందినట్టు తేల్చారు. బుధవారం మరో సారి సుప్రభాత సేవకు రాగా టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించి పట్టుకుని తిరుమలలో పోలీసులకు అప్పగించారు.

హోటల్ లైసెన్స్ రద్దు

తిరుమలలోని తొమ్మిది పెద్ద హోటళ్లలో ఒకటైన, కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలోని బాలాజీ భవన్ హోటల్ లైసెన్స్‌ను టీటీడీ రద్దు చేసింది. ప్రస్తుతం హోటల్ చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజు రూ.76,04,196గా ఉంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా, లైసెన్సు ఫీజు చెల్లించనందుకు హోటల్ లైసెన్స్‌ను రద్దు చేసి, టీటీడీ రెవెన్యూ, హెల్త్, విజిలెన్స్ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం హోటల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌పీఏలో ముగిసిన ఆక్వాటిక్ మీట్

బెస్ట్ స్విమ్మర్‌గా పంకజ్ యాదవ్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో రెండు రోజులపాటు నిర్వహించిన అన్యువల్ ఆక్వాటిక్ మీట్ శుక్రవారం విజయవంతంగా ముగిసింది. స్విమ్మింగ్ పోటీల్లో 75వ ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ట్రైనీలు ఉత్సాహంగా పోటీపడ్డారు. ఈ ఆక్వాటిక్ మీట్‌లో బెస్ట్ స్విమ్మర్‌గా పంకజ్‌యాదవ్ నిలిచారు. జాతీయ పోలీసు అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్, పారా స్విమ్మర్ నిరంజన్ ముకుందన్ డైరెక్టర్స్ విజేతలకు పతకాలు అందజేశారు.

బహుమతి అందుకుంటున్న పంకజ్

తహసీల్‌లో కొట్టుకున్న కాంగ్రెస్ రియల్టర్లు

- మర్పల్లి మండలం సిరిపురంలోని ఇనామ్ భూమి విషయంలో దాడి

వికారాబాద్, జూలై 19, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ నియోజకవర్గంలో ఓ భూమి విషయంలో కాంగ్రెస్ నాయకులు కొట్టుకున్నారు. మర్పల్లి మండలం సిరిపురం గ్రామంలో సర్వే నెంబర్ 461, 462లలోని ఇనామ్ భూమి.. అదే గ్రామానికి చెందిన మోహన్‌తోపాటు మరికొందరి పేరుమీద ఉంది. ఈ భూమి పంచనామా విషయంలో శుక్రవారం మోహన్‌ను వెంట బెట్టుకొని కాం గ్రెస్ నాయకులు చిన్న మైసగళ్ల నర్సింలు మర్పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో సిరిపురం గ్రామానికి చెందిన మరో కాంగ్రెస్ నాయకుడు మాణిక్యరావు అలియాస్ మల్లేశంతోపాటు తుమ్మలపల్లికి చెందిన దొడ్ల జయరాజ్ కలిసి ఈ భూమి పంచనామా విషయమై ఆర్ఐతో మాట్లాడుతున్నారు. అక్కడే ఉన్న నర్సింలు వర్గీయులు కలుగజేసుకొని 'మా గ్రామానికి సంబంధించిన భూముల గురించి నీకేం అవసరం' అంటూ తుమ్మలపల్లికి చెందిన జయరాజ్‌పై దాడి చేశాడు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు తహసీల్దార్ కార్యాలయంలోనే కొట్టుకున్నారు. ఈ దాడిలో మాణిక్యరావు తలకు గాయం కావడంతో మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కొట్టుకున్న వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరల్‌గా మారింది.

తహసీల్దార్ కార్యాలయంలో కొట్టుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రాభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర

- తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నాబార్డ్ కీలకపాత్ర పోషించిందని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ చింతల సుశీల్ అన్నారు. 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పథకాలలో నాబార్డ్ భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందన్నారు. నాబార్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడంతోపాటు ఇంక్యూబేషన్ సెంటర్‌లతో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక, ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు మాట్లాడుతూ..నాబార్డు ప్రోత్సాహంతో పంటలపైన కాకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, ఫిషరీస్ తదితర రంగాలద్వారా కూడా ఆదాయం గణనీయంగా పెరుగుతున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి తలసరి ఆదాయంలో 10వ స్థానంలో ఉన్న రాష్ట్రం, ప్రస్తుతం మూడో స్థానానికి ఎగబాకిందన్నారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్ఏబీ అధ్యక్షుడు ఎం రవీందర్ రావు మాట్లాడుతూ.. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాబార్డ్ గ్రాస్ రూట్ స్థాయిలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

ప్రొఫార్మా 10-1

బహిరంగ ప్రకటన

PUB/0702

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్ పైగల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:

సెక్షన్: సికింద్రాబాద్ డివిజన్: బల్హార్షా–కాజీపేట్ సెక్షన్ మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ నిర్మాణం–ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు కి.మీ. 140.830 నుండి కి.మీ. 135.00 వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు KM/CH: 140.830m నుండి KM/CH: 135.000m వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య OHE మాస్ట్ Loc. 135/02 (km/Ch: 135/21.90) ఎస్‌సిఆర్ పరిధి నుండి OHE మాస్ట్ Loc. 140/36 (km/Ch: 140/830.90.10)వరకు 25000 ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: **10-08-2024**న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్టుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

ప్రొఫార్మా 10-2

(ACTM Para 21020, Vol II, Part I : Correction Slip No. 32, Dated 09-10-2020)

ac 25kV ట్రాక్షన్ ప్రారంభం

"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:

సెక్షన్: సికింద్రాబాద్ డివిజన్: బల్హార్షా–కాజీపేట్ సెక్షన్ మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ నిర్మాణం–ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు కి.మీ. 140.830 నుండి కి.మీ. 135.00 వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య కొత్త BG ఎలక్ట్రిఫైడ్ మూడవ లైన్ ప్రారంభానికి సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో ప్రయాణీకుల పబ్లిక్ రవాణా మరియు ఫ్రైట్ సర్వీసెస్ ఆపరేషన్ కొరకు KM/CH: 140.830m నుండి KM/CH: 135.000m వరకు బల్హార్షా (ఎస్‌సిఆర్ పరిధి) మరియు మానిక్‌గర్ స్టేషన్ల మధ్య OHE మాస్ట్ Loc. 135/02 (km/Ch: 135/21.90) ఎస్‌సిఆర్ పరిధి నుండి OHE మాస్ట్ Loc. 140/36 (km/Ch: 140/830.90.10)వరకు లైవ్ ట్రాక్షన్ వైర్ ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్ళు వాహనములను నివారించు నిమిత్తం **రోడ్ లెవల్‌కు ఎగువన 4.78m స్పష్టమైన గరిష్ఠ ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైట్‌గేజ్‌లు స్థాపించబడినవి.**

లోడ్‌తో వెళ్లు వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తుని గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములనందు తీసుకెళ్లు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించరాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్లు వాహనములకు సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి:

i) హైట్‌గేజ్‌కు ప్రమాదం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది.

ii) వాహనములపై తీసుకెళ్లు సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చును.

iii) కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చును మరియు ప్రాణాంతకం కావచ్చును.

A0894 డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, సికింద్రాబాద్

స్టాక్ మార్కెట్లకు మైక్రోసాఫ్ట్ దెబ్బ

ముంబై, జూలై 19: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. రికార్డు స్థాయి గరిష్ఠాల్లో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. మరోవైపు మైక్రోసాఫ్ట్‌లో సాంకేతిక సమస్య అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. ఈ పరిణామం భారతీయ మార్కెట్ల నష్టాలను మరింత పెంచింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 738.81 పాయింట్లు లేదా 0.91 శాతం పడిపోయి 81 వేల మార్కుకు దిగువన 80,604.65 వద్ద ముగిసింది. నిజానికి తీవ్ర ఒడిదొడుకుల్లోనే ట్రేడింగ్ సాగింది. ఒకానొక దశలో గురువారం ముగింపుతో చూస్తే 244 పాయింట్లకుపైగా ఎగిసి ఆల్‌టైమ్ హైని తాకుతూ 81,587.76 వద్దకు సూచీ వెళ్లింది. అయితే ఈ ఉత్సాహం ఎంతోసేపు నిలబడలేకపోయింది. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోవడంతో 844.36 పాయింట్ల నష్టాన్ని సెన్సెక్స్ మూటగట్టుకోవడం గమనార్హం. చివరకు కొంతమేర కోలుకున్నా.. నష్టతీవ్రత ఎక్కువగానే ఉన్నది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 269.95 పాయింట్లు లేదా 1.09 శాతం దిగజారి 24,530.90 వద్ద స్థిరపడింది. ఇంట్రా–డేలో మునుపెన్నడూ లేనివిధంగా 24,854.80 స్థాయికి చేరినా.. నిలదొక్కుకోలేకపోయింది. ఈ నేపథ్యంలోనే 292.7 పాయింట్ల మేర నష్టపోయింది. అయితే ఆఖర్లో కాస్త కోలుకున్నది. అంతకుముందు 4 రోజుల పాటు స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే కదలాడిన విషయం తెలిసిందే. సెన్సెక్స్ 1,446.12 పాయింట్లు లేదా 1.80 శాతం పుంజుకున్నది.

8 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల నష్టాల నేపథ్యంలో మదుపరుల సంపద ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో హరించుకుపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.8 లక్షల కోట్లదాకా ఆవిరైపోయింది. రూ.7,94,059. 53 కోట్లు క్షీణించి రూ.4,46,38,826.75 కోట్ల (5.34 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. వరుస లాభాల మధ్య మదుపరుల సంపద రూ.455 లక్షల కోట్లనూ తాకిన సంగతి విదితమే.

రంగాలవారీగా..

మెటల్ రంగ షేర్లు అత్యధికంగా 4.11 శాతం పడిపోయాయి. కమోడిటీస్ 3.07 శాతం, చమురు–గ్యాస్ 2.87 శాతం, విద్యుత్తు 2.67 శాతం, ఆటో 2.53 శాతం, యుటిలిటీస్ 2.51 శాతం, రియల్టీ 2.44 శాతం, సేవలు 2.42 శాతం చొప్పున నష్టపోయాయి. టాటా స్టీల్ షేర్ విలువ 5 శాతానికిపైగా దిగజారింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటర్స్, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లూ మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య.. అన్ని రంగాలనూ ప్రభావితం చేసింది. దీంతో ఆయా దేశాల స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది. ఆసియా దేశాల్లో ప్రధానంగా దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టాలను చవిచూశాయి. చైనా సూచీ లాభపడింది. అలాగే కీలక ఐరోపా మార్కెట్లలో ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ సూచీలూ నష్టపోయాయి. గురువారం నష్టాల్లో ముగిసిన అ